క్లుప్తంగా

మే 7న పౌరాణిక ఏకపాత్రాభినయ పోటీలు

బలిజిపేట: మండలంలోని బడేవలసలో వచ్చే నెల 7వ తేదీ రాత్రి 9గంటలకు పౌరాణిక పద్యాల ఏకపాత్ర పోషణ పోటీలను నిర్వహించనున్నామని ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు దిగువన ఇచ్చే ఫోన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. శ్రీరామాలయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శ్రీవాణి, శివాని నాటక సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎస్.సింహాచలం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారిని సన్మానించి బహుమతులను అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు ఫోన్ 9849833439, 8367085591 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వయోజన విద్య కేంద్రం ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మొండెంఖల్లు పంచాయతీ, కొత్తూరులో వయోజన విద్య కేంద్రాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం ప్రారంభించారు. స్వార్డ్ సంస్థ ఆధ్వర్యంలో నెలకొల్పబడిన ఈ సంస్థలో నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతిఒక్కరినీ అక్షరాస్యులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో స్వార్డ్ సంస్థ డైరెక్టర్ బి.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై దర్యాప్తు చేపట్టాలి



ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

పాలకొండ: అనుమానాస్పదంగా మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మద్దతుగా క్రైస్తవ సంఘాలు సోమవారం పట్టణంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఆయన మృతిపై అనుమానాలున్నాయని, వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ తనిఖీ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల ఆధారంగా గొడౌన్‌లోని బియ్యం, కందిపప్పు, పంచదార, వంటనూనెల నిల్వలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. సరుకులను సకాలంలో రేషన్ డిపోలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయాలని గొడౌన్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావుకు సూచించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతినెలా జిల్లాలోని 588 డిపోలకు 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నామని, ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే బియ్యం, పప్పు అందజేయడం జరుగుతుందని, రేషన్ కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయడం లేదన్నారు.

ఏఎంసీ పదవులపై టీడీపీలో ముసలం


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పాలకొండ: ఏఎంసీ పదవుల కేటాయింపుతో నియోజకవర్గంలోని కూటమి నాయకుల్లో ముసలం మొదలైంది. అర్హత లేనివారికి పదవులు కట్టబెట్టారని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ వర్గానికి చెందిన టీడీపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కల్యాణ మండపంలో సమావేశమై వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుపై ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు పరిశీలిస్తే.. పాలకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవిని జనసేనకు చెందిన సంధ్యారాణికి కేటాయించారు. వైస్ చైర్మన్, సభ్యులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి వర్గానికి చెందిన వారికి కేటాయించారని అని జయకృష్ణ వర్గానికి చెందిన టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. టీడీపీ నాయకులు గంటా సంతోష్, కర్నేన అప్పలనాయుడు, జాడ శ్రీధర్, కంబర కృష్ణ, తదితరులు మాట్లాడుతూ.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి పార్టీకి సహకరించలేదని, ఆటువంటి ఆమెకు ఎందుకు ప్రాధాన్యం కల్పిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అచ్చెన్నాయుడు సహకారంతోనే భూదేవి వర్గానికి పదవులు వస్తున్నాయని మండిపడ్డారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వద్దే తేల్చుకుంటామని చెప్పారు.

● ఏరియా ఆస్పత్రిలో ఆధునిక పరికరం..



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్‌కు సంబంధించి ఆధునిక వైద్య పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు పరికరాన్ని సోమవారం ఇన్‌స్టాలేషన్ చేశామన్నారు. సీఎస్ఆర్ నిధులు రూ.12.5 లక్షలతో ఐటీడీఏ పీఓ పరికరాన్ని సమకూర్చారని తెలిపారు. – సీతంపేట

● చలివేంద్రం ఏర్పాటు ..



నగరంలోని సబ్‌జైల్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. డీఎస్పీ ఎం. రాంబాబు ఆధ్వర్యంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ బి. జోగులు, తదితరులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్, కోర్టు, రెవెన్యూ కార్యాలయాలకు వివిధ పనుల మీద వచ్చే వారికి చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని డీఎస్పీ తెలిపారు. – పాలకొండ రూరల్

● ఒక్క అర్జీ రాలేదు..



మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒక్క అర్జీ కూడా రాలేదు. మండుతున్న ఎండలు ఓ వైపు.. సమస్యలు తెలియజేసినా పరిష్కరిస్తారన్న నమ్మకం లేకపోవడం మరోవైపు.. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలెవ్వరూ రావడం లేదు. ఎంపీడీఓ కొండపల్లి సత్యం, హౌసింగ్ ఏఈ చంద్రశేఖరనాయుడు అర్జీదారుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. – భామిని

ఓఆర్ఎస్‌తో..
డీ హైడ్రేషన్‌కు చెక్..!

- వేసవిలో పెరుగుతున్న డీ హైడ్రేషన్ సమస్య
- ఎండల బారినపడి నీరసించిపోతున్న జనం
- ఓఆర్ఎస్‌తో ఉపశమనం పొందవచ్చని వైద్యుల సూచన
- ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు


ప్రభుత్వాస్పత్రుల వద్ద విరివిగా లభ్యమవుతున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు

గుమ్మలక్ష్మీపురం: వేసవి వచ్చిందంటే చాలు మండే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తాయి. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు జనం భయపడుతున్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇంటిని వీడి రావడం లేదు. ఇదిలా ఉంటే ఏటా వేసవికాలంలో ప్రజలు ప్రధానంగా డీ హైడ్రేషన్ సమస్యను ఎదుర్కొంటున్నారు. శరీరంలో తగినంత నీటిశాతం లేకపోవడాన్ని డీ హైడ్రేషన్‌గా పిలుస్తారు. సాధారణంగా మనకు చెమట పట్టినప్పుడు, మూత్ర విసర్జనప్పుడు మాత్రమే మన శరీరం నుంచి నీరు బయటకుపోతుంది. అలా కాకుండా వేసవిలో పనుల నిమిత్తం ఎండల్లో బాగా తిరగాల్సి వచ్చినప్పుడు.. వేడిగాలుల బారినపడినప్పుడు మన శరీరం.. నీటి శాతంతో పాటు కొన్ని ద్రవాలను కోల్పోయి డీ హైడ్రేట్ అవుతుంది. అప్పుడు తలనొప్పి, తల తిరగడం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఒక్కోసారి ఇదే పరిస్థితుల్లో వడదెబ్బకు గురై చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ నేపథ్యంలో శరీరం నీటిశాతం కోల్పోకుండా(బాడీ డీహైడ్రేషన్ అవ్వకుండా) భద్రగిరి సీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్ పలు సూచనలు చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా దొరికే ఓఆర్ఎస్(ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్) తాగి ఎండల వేడి నుంచి ఉపశమనం పొందవచ్చని, ఆరోగ్యంగా ఉండొచ్చని చెబుతున్నారు.

ఓఆర్ఎస్ ఇలా తాగాలి..

- వివిధ లవణాల మిశ్రమం కలిగిన ఓఆర్ఎస్ పౌడర్ ప్యాకెట్లు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటాయి.

వడదెబ్బ నుంచి కాపాడుతుంది..



శరీరంలో ఉండాల్సిన నీటిశాతం తగ్గిపోతూ వస్తే బాడీ డీహైడ్రేట్ అయి వడదెబ్బకు గురవుతాం. అలాంటి పరిస్థితుల నుంచి బయటపడేందుకు తరచూ నీరు తాగడం గానీ, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం గానీ చేయాలి. జ్వరం, తలనొప్పి, తల తిరగడం, చీకటి కమ్మినట్లు అనిపించడం అనిపిస్తే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. అప్పుడే వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగి, కాస్త ఆరోగ్యం కుదుటపడుతుంది.

–ఆర్.రవికుమార్, వైద్యాధికారి, భద్రగిరి సీహెచ్‌సీ

- 20.5 గ్రాముల ఈ పౌడర్ ప్యాకెట్‌లో 2.6 గ్రాముల సోడియం క్లోరైడ్, 1.5 గ్రాముల పొటాషియం క్లోరైడ్, 2.9 గ్రాముల సోడియం సిట్రేట్, 13.5 గ్రాముల డెక్స్‌ట్రోజ్ ఉంటాయి.
- ఈ పౌడర్‌ను సురక్షితమైన లీటరు మంచినీటిలో తగిన మోతాదులో కలిపి తాగాలి.
- రెండేళ్ల వయసులోపు వారు.. 100 ఎంఎల్ ద్రావణాన్ని అర స్పూన్ చొప్పున ప్రతి 10 నిమిషాలకు ఒకసారి తాగాలి.
- 2 నుంచి 10 ఏళ్ల వయసు వారైతే 100 నుంచి 200 ఎంఎల్(ఒక గ్లాస్) చొప్పున తాగాలి.
- పదేళ్ల వయసు పైబడిన వారంతా 50 ఎంఎల్(చిన్నగ్లాస్) చొప్పున ఎండలో తిరిగే దాని బట్టి తాగితే సరిపోతుంది.
- ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో లేకపోతే ఇంట్లోనే లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, అర స్పూన్ పంచదార కలిపి తాగాలి.

జాగ్రత్తలు తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారి

పాలకొండ రూరల్: ఖరీఫ్ సాగు చేపట్టే రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ ఎ.డి కె. రత్నకుమారి తెలిపారు. వ్యవసాయ, అనుబంధ అధికారులను సమన్వయం చేసుకుంటూ రైతులు ముందుకెళ్లాలని సూచించారు. మండలంలోని సింగన్నవలస రైతుసేవా కేంద్రంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. రానున్న సీజన్‌లో చిరుధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, అందించనున్న రాయితీలపై అవగాహన కల్పించారు. పీఎండీఎస్ విత్తనాలు వినియోగించడం ద్వారా భూమికి కలిగే ప్రయోజనాలు, గట్లపై కందిసాగు, వరిలో లైన్‌సోయింగ్, కాలిబాటలు ఏర్పాటు వల్ల కలిగే దిగుబడి, ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, వెలుగు అధికారులు, ఏఓ వాహిని, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం


బురుజోలలో ఆరోగ్య ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు

భామిని: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడమే తమ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పసుపులేటి సోయల్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బురుజోలలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సిబ్బంది నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాస్కరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ర్యాలీ సోమవారం చేపట్టారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు లేని జీవితాన్ని గడపాలనుకుంటే కచ్చితంగా జీవన శైలి మార్చాల్సి ఉంటుందన్నారు. ప్రతిరోజూ తినే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. పిండిపదార్థాలతో పాటు మాంసపుకృత్తులు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే ఎముకలు, కండరాలు బలంగా ఉండేందుకు వ్యాయామం, యోగా, ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చిన్నమ్మి, రవణమ్మ, ఉదయకుమారి తదితరులు పాల్గొన్నారు.


గరుగుబిల్లి: ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

భావితరాలకు 'ప్రకృతి వ్యవసాయం'


మాట్లాడుతున్న ఏఓ సౌజన్య

వీరఘట్టం: భావితరాలకు మనమిచ్చే ఆస్తి ప్రకృతి వ్యవసాయం కావాలని రైతు సాధికారిత సంస్థ స్టేట్ రిసోర్స్‌పర్సన్ దేవుళ్లు అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ప్రకృతి వ్యవసాయం, వెలుగు, తదితర శాఖల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. వీరఘట్టం మండలంలో 1300 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు లక్ష్యంగా చేసుకున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి జక్కువ సౌజన్య తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలితకుమారి, ఏడీఏ రత్నకుమారి, రైతు సాధికారిత సంస్థ జోనల్ కో ఆర్డినేటర్ ఏడీఏ ప్రకాష్, ఏఓ శ్యామ్‌సుందర్, ఏపీఎం కె.రాము, ఉద్యానవనశాఖ అధికారి అమరేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో జి.పైడితల్లి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె వేతనదారులకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. అలాగే వేసవి ఎండల బారినపడకుండా రోజుకు రెండు పూటలా చల్లని సమయాల్లో పనులు చేసుకోవాలని తెలిపారు. పని ప్రదేశంలో టెంట్లు, ప్రథమ చికిత్స కిట్, తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

త్వరితగతిన పొజిషన్ సర్టిఫికెట్లు..


తహసీల్దార్ సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి

వీరఘట్టం: గృహ నిర్మాణ లబ్ధిదారులకు కావాల్సిన పొజిషన్ సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేయాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ చందక సత్యనారాయణను కలిసి ఈ విషయమై చర్చించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు శౌంట్యాన సింహాచలం ఉన్నారు.

పరామర్శ..


మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సవర తిక్కమై కుటుంబంతో పాటు గాయపడిన పలవురిని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం పరామర్శించారు. మృతురాలి స్వగ్రామమైన రాజన్నగూడ.. అలాగే అక్కన్నగూడలలో ఉన్న ఆయా కుటుంబాలను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆటో ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు నిర్మించి పక్కన బెర్మలు వేయకుండా వదిలేయడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈమె వెంట ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు ఎన్.తిరుపతిరావు, బి.తిరుపతిరావు, వెంకునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.మహేష్, తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

10న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు

జియ్యమ్మవలస రూరల్: కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 10వ తేదీన వివిధ కంపెనీల్లో ఉద్యోగాల నిమిత్తం నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రమేష్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. హీరో మోటార్, అపోలో ఫార్మసీ, వోల్టాస్ తదితర 10 కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు చేయడం జరుగుతుందని, 18 నుంచి 35 ఏళ్ల వయసు యువతీయువకులంతా తమ విద్యార్హతలు తెలిపే సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలోని హరిజన వీధికి చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ యువతి ఇంతవరకు ఇంటికి చేరకపోవడంతో ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వినతిపత్రం అందజేత

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కురుపాం మండల కేంద్రంలో తహసీల్దారు ఎం.రమణమ్మకు వీఆర్‌ఏలంతా సోమవారం వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ శాఖలో కింది స్థాయి ఉద్యోగులుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని, కనీస వేతనం కింద రూ.26 వేలు ఇవ్వడంతో పాటు డీఏ కూడా ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే నైట్ డ్యూటీలు రద్దు చేసి, పదోన్నతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న వీఆర్‌ఏ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు జి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: తమ గ్రామంలోని పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని శివ్వాం గ్రామానికి చెందిన పలువురు ఎంపీడీవో జి.పైడితల్లిని మండల కేంద్రంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పి.మోహన్‌రావు, బి.నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి


రైతులతో సమావేశమైన ఏవో జ్యోత్స్న

జియ్యమ్మవలస: రైతులంతా సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏవో జ్యోత్స్న ఆకాంక్షించారు. మండలంలోని కన్నపుదొరవలస గ్రామంలో సర్పంచ్ రెడ్డి పార్వతి అధ్యక్షతన వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక సర్వేపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. ప్రస్తుతం వ్యవసాయ ఖర్చులు బాగా పెరిగిన నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంపై రైతులంతా దృష్టిసారించాలని ఏవో తెలిపారు. మార్కెట్‌లో ఏ పంటకు ఎంతమేర డిమాండ్ ఉందన్న విషయం తెలుసుకుని, పంటలు సాగు చేస్తే ఆర్థిక సుస్థిరత సాధించడం కష్టమేమీ కాదన్నారు. 365 రోజులూ పంటలు పండించేలా చూడాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో సబ్సిడీపై ఇచ్చే పచ్చిరొట్ట ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. అనంతరం వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు–వాటి వల్ల వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, వీఏఏ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం రేపు

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న రామమందిరం వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకటరమణ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే వైద్యశిబిరం ఉంటుందని, రావాలనుకునే వారు ఆరోగ్యశ్రీ, ఆధార్‌కార్డులు తీసుకురావాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

● ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: వరుస ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వై. అమ్మన్నరావు సూచించారు. రెండు రోజుల్లో వేర్వేరు చోట్ల ఆటోలు బోల్తా పడడంతో ఇద్దరు మృతి చెందడంతో పోలీసులు సోమవారం స్థానిక వారపు సంత వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. ఘాట్‌రోడ్ల మీదుగా రాకపోకలు సాగించే ఆటో డ్రైవర్లు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ఫ్ ఆపరాదని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

● గిరిజనం గొంతెండుతోంది..



ప్రభుత్వ అలసత్వం కారణంగా గిరిజనం గొంతెండుతోంది. వేసవి వస్తుందనగానే ముందస్తుగా తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అయితే ఇప్పుడు ఎక్కడా అటువంటి పరిస్థితులు కనిపించకపోవడంతో దాహంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. తాగుదామంటే గుక్కెడు మంచినీళ్లు లేవని వాపోతున్నారు. ప్రభుత్వాలు స్పందించి, తమకు తాగునీరు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదీ.. కురుపాం మండలం, జి.శివడ, దోకులగూడ, వలసబల్లేరు పంచాయతీల్లోని బుడ్డిగాడుగూడ, ఆగంగూడ, చాపరాయిగూడ గ్రామస్తుల పరిస్థితి. వారంతా ఇలా సోమవారం ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. తాగునీటి సదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ చిత్రంలోని కనిపిస్తోంది.. బుడ్డిగాడుగూడ గిరిజనులు.

–గుమ్మలక్ష్మీపురం(కురుపాం)